# మానవత్వమా నీకు జోహార్

**ఎం.ఆర్.వి.సత్యనారాయణమూర్తి**

''రండి, శైలజగారూ రండి!'' అంటూ ఆహ్వానించింది సుబ్బలక్ష్మిగారు.

గుమ్మం బయట చెప్పులు విడిచి లోపలకు వచ్చి సోఫాలో కూర్చుంది శైలజ. టి.వి. లో సీరియల్ వస్తోంది. ఫ్రిజ్‌లోంచి చల్లని నీళ్ళు తెచ్చి ఇచ్చింది శైలజకు.

''ఇంకా మన ఫ్రెండ్సు రాలేదా?''

''వచ్చేస్తారు. మీరు 2 గంటలకు వస్తారని ఫోన్ చేసి చెప్పాను'' బదులిచ్చింది సుబ్బలక్ష్మి.

ఐదు నిముషాలు గడిచేసరికి బిలబిలమంటూ సుబ్బలక్ష్మి ఇంటికి చేరారు పద్మ, వనజ, వినుత.

''బాగున్నారా'' అంటూ వారందరినీ పేరు పేరునా పలకరించింది శైలజ. అందరూ రిలాక్సయ్యాకా చందన బ్యాగుల్లోంచి చీరలు బయటకు తీసి చూపించింది నలుగురికీ. అరగంట అయ్యేసరికి ఒక్కొక్కరు రెండు చీరలు సెలక్టు చేసుకున్నారు.

పర్స్‌లోంచి పాకెట్‌బుక్ తీసుకొని ఎవరు ఎంత ధర చీరలు తీసుకున్నారో నోట్ చేసుకుంది శైలజ. మిగిలిన చీరలు బ్యాగ్‌లో సర్దుకొని వస్తానని చెప్పి బయటకు బయల్దేరింది.

''బ్యాంక్ ఆఫీసరు పెళ్ళాం అయినా ఈవిడకి ఇదేంపిచ్చండీ'' దీర్ఘాలు తీస్తూ కామెంట్ చేసింది సుబ్బలక్ష్మి.

''పిచ్చికాదండీ. డబ్బు సంపాదన. ఈ బ్యాంకు ఉద్యోగస్తులకి, వాళ్ళ తాలూకా వాళ్ళకు డబ్బు, వడ్డీ ఈ రెండూ తప్పితే వేరే మాటలుండవు.'' పమిట చెంగుతో మొహం మీద లేని చెమటను తుడుచుకుంటూ అంది వజన.

''అవునండీ. తునిలో మా చెల్లెలు వాళ్ళింట్లో బ్యాంకువాళ్ళు అద్దెకుంటున్నారు. కూరలు దగ్గర్నుంచీ ఏరోజు కావల్సిన డబ్బు ఆరోజే బ్యాంకు నుండి తీసుకుంటారట. చివరకు వాళ్ళబ్బాయి నోట్సు పుస్తకం కావాలి నాన్నా అన్నా బ్యాంకుకు వచ్చి డబ్బు తీసుకోమంటారుట. ఇంట్లో పది రూపాయలకు మించి వుండవట. మా చెల్లెలు చెప్తూ వుంటుంది వాళ్ళ సంగతులు'' నాటకీయంగా చెప్పింది వినుత.

''ఏమోనమ్మా. ఇంట్లో డబ్బులేకుండా ఎలా వుంటారో నాకర్థం కాదు. మా యింట్లోమాత్రం వెయ్యి రూపాయలు తక్కువ ఎప్పుడూ వుండదు. అలా వుండకపోతే నాకు నిద్దరపట్టదంటే నమ్మండి'' అంది పద్మ.

''ఏది ఎలావున్నా శైలజగారు మంచి చీరలు తెస్తుంది. పైగా షాపువాడికంటే తక్కువ ధరకు ఇస్తుంది. చూస్తున్నాంగదా ఒక్కటీ రంగు వెలవలేదు, పోట్టి అవలేదు'' అంది సుబ్బలక్ష్మి.

''నిజమే. మొన్న మావారు హైద్రాబాదు క్యాంపునకు వెళ్ళినపుడు తెచ్చిన చీర రెండుసార్లు తడిపేసరికే రంగు మారిపోయింది. అయిదు వందలూ గోదావరిలో పోసినట్లయ్యాయి.''

''మీరు టి.వి. చూస్తూ మాట్లాడుతూ వుండండి. నేనీలోగా పంటి కిందకు కాసిని 'కరకరలు' తెస్తాను'' అంటూ లోపలకు వెళ్ళింది సుబ్బలక్ష్మి.

సిటీకి చివరగావున్న ఆ కాలనీలో ఈమధ్యనే వచ్చి చేరారు శైలజ, ఆమె భర్త శ్రీహరి. బ్యాంకులో ఆఫీసరుగా పనిచేస్తున్న శ్రీహరి ఉదయం తొమ్మిదిన్నరయ్యేసరికి బయటకు వెళ్ళిపోతాడు. మళ్ళీ రాత్రి ఏడూ, ఎనిమిది గంటలైతేనే కానీ ఇంటికి రాడు. ఏదో ఒక వ్యాపకం ఉండాలని శైలజ ఈ కాలనీ, పక్క కాలనీ వాళ్ళకు చీరలు అరువుపై అమ్మి రెండు మూడు వాయిదాలుగా డబ్బు వసూలు చేస్తుంది.

సిటీకి ఆటోలమీద వెళ్ళి షాపింగ్ చేయవలసిన అవసరం లేకుండా ఇంటి వద్దకే తీసుకువచ్చి ఇవ్వడం, పైగా డబ్బు ఒకేసారి చెల్లించనక్కరలేకుండా అరువు, వాయిదాల సౌకర్యం వుండటంతో చాలామంది శైలజవద్ద చీరలు కొంటున్నారు. ఆ కాలనీలో సుబ్బలక్ష్మిగారే అందరిలో పెద్దగా వుంటూ అందరికీ సాయం చేస్తూవుంటుంది. అయితే ఆవిడకు ఎదుటివారిని ఏదో ఒకటి అనందే తోచదు. కానీ చెయ్యి మాత్రం భారీ చెయ్యి. ఇంటికి వచ్చిన వారికి రోజూ కాఫీ, టిఫిన్లు ఇస్తూ వుంటుంది.

రోజూ మధ్యాహ్నం రెండు దాటాకా సుబ్బలక్ష్మిగారి ఇంటికి చేరడం, లోకాభిరామాయణం చెప్పుకుంటూ టి.వి. సీరియల్స్ చూడటం, ఆవిడ చేసే మర్యాదలు స్వీకరించి అయిదు గంటలకు [illegible] వెళ్ళడం ఆ ముగ్గురికీ అలవాటు.

లోపల్నుంచి నిండుగావున్న చేగోడీల [illegible] నాలుగు ప్లేట్లు, ఒక వాటర్ బాటిల్ తెచ్చింది సుబ్బలక్ష్మి. సీసామూత తీసి అందులో నుండి చేగోడీలు నాలుగు ప్లేట్లలో సర్దింది.

''శైలజగారు మధ్యాహ్నంపూట చీరలమ్ముతుంది మరి పొద్దున్నే పదిగంటలకు ఇంటికి తాళంపెట్టి బయటకు వెళ్ళి మరలా ఒంటిగంటకు వస్తుంది. ఎక్కడైనా కాన్వెంటులో పనిచేస్తున్నారా అంటే లేదంటుంది. మరెక్కడకు వెళ్తారు అంటే నవ్వుతుందేగానీ సమాధానమివ్వదు. ఏమిటంటారు ఆ రహస్యం సుబ్బలక్ష్మిగారూ!'' చేగోడీలు తింటూనే గరగరమంటూ మాట్లాడింది వనజ.

సుబ్బలక్ష్మిగారు రెండు మూడుసార్లు చెప్పిచూసింది ''తినడం అయ్యాకా మాట్లాడండి, లేదా మాట్లాడటం అయ్యాకా తినండీ'' అని. ఊహూ! ఆవిడ వింటేగా. ఆవిడ ధోరణే ఆవిడది.

''పోనీలెద్దురూ! భర్త బ్యాంకుకి వెళ్ళిపోయాకా అలా ఏ గుడికో వెళ్తుందేమో!''

''అబ్బే! గుడికి వెళ్తే ఒకరోజు కాకపోతే ఒకరోజైనా టెంకాయో, పళ్ళో, పూలో తీసుకువెళ్తారు కదా! చేతులూపుకుంటూ వెళ్ళి వస్తుంది. నేను చాలాసార్లు పరీక్షగా చూసాను'' మళ్ళీ గరగర మంటూ చెప్పింది వనజ.

''అదిగో మంచిసీను వస్తోంది టి.వి.లో చూడండి'' అని వినుత హెచ్చరించడంతో నలుగురూ సీరియల్ చూడటంలో మునిగిపోయారు. వాల్‌క్లాక్ 5 గంటలకు సుతారంగా పియానోలా ధ్వనించడంతో చీరల ప్యాకెట్లతో ఎవరింటికి వారు బయల్దేరారు పద్మ, వనజ, వినుత.

• • •

పది రోజులు గడిచాకా వనజ సుబ్బలక్ష్మిగారింటికి ఆయాసపడుతూ వచ్చింది.

''ఈ విషయం విన్నారా? మొన్న శైలజగారు మా వారికి బట్టలషాపులో కనిపించారట. ఆ షాపతనితో ఒకటే యికయికలు, పకపకలూట. మావారూ, ఆయన ఫ్రెండూ ముక్కున వేలేసుకొని బయటకు వచ్చేసార్ట.''

వనజ చెప్పడం ముగించేసరికి వినుత కూడా వచ్చింది.

''సుబ్బలక్ష్మిగారూ! మా అబ్బాయికి శైలజగారు వాళ్ళకాలేజీలో కనిపించారట. ఏవో హేండీక్రాఫ్టు తీసుకువచ్చి లెక్చరర్స్‌కు అమ్ముతున్నారట. మా అబ్బాయిని పలకరించారట కూడా. బ్యాంక్ ఆఫీసరు భార్య అయివుండీ ఇలా ప్రతీచోటికీ తగుదునమ్మా అంటూ బయల్దేరుతోంది. ఏం బాగుంటుంది చెప్పండి?''

''ఏవిటోనమ్మా శైలజ వ్యవహారం నాకూ అర్థంకావ డంలేదు. ఈ అమ్మాయికి డబ్బు సంపాదన మీద బాగా మోజు పుట్టినట్టుంది. లేకపోతే ఈ అమ్మకాల పేరుతో ఎంతకష్టపడుతోంది. ఎంతదూరమైనా అలా సంచులు మోసుకుంటూ నడిచివెళ్ళి చీరలు అమ్ము తుంది. పోనీ ఆ అమ్మకాల లాభాల్లోంచైనా కొంత ఖర్చుచేసి ఆటోలమీద వెళ్ళవచ్చుకదా! ఊహూ! అలా చేయదు. ఎందుకంత పిసినారిగా వుంటోందో ఆ దేవుడికే తెలియాలి. ఈసారి కలుసుకున్నప్పుడు ఆమెని అడగాలి.''

• • •

యధాప్రకారంగా మధ్యాహ్నం 2 గంటలకు సుబ్బాలక్ష్మిగారి యింట్లో వనజ, వినుత, పద్మ సమావేశమైన తరుణంలో శైలజ కూడా వచ్చింది. కుశల ప్రశ్నలయ్యాక సుబ్బాలక్ష్మిగారు అడిగారు–

''చూడండి శైలజగారూ! మీరేమీ అనుకోకుండా వుంటే మేము ఒక విషయం అడుగుదామనుకుంటున్నాము.''

''మీరు పెద్దవారు. సంశయమెందుకు అడగండి. నేనేమీ అనుకోను.''

''మీరు ముగ్గురు కుటుంబ సభ్యులు. మీవారు బ్యాంకు ఆఫీసరు. సుమారు ఇరవైవేల వరకూ జీతం వస్తుందనుకుంటాను.''

''అవును.''

''ఆర్థికంగా లోటులేని మీరు ఈ చీరల అమ్మకం, ఇతర వస్తువుల అమ్మకం కోసం ఎందుకింత శ్రమపడుతున్నారు? మీ విద్యార్హతలతో ఏ కాన్వెంట్లో పనిచేసినా నెలకు 1500 నుండి రెండువేల రూపాయల వరకూ వస్తాయి. ఒక సంవత్సరం నుండీ మిమ్మల్ని గమనిస్తున్నాను. మీరు ఈ కాలనీకి వచ్చినప్పుడున్న చలాకీతనం ఇప్పుడు లేదు. ఏదో బరువు మోస్తున్న వ్యక్తిలా గంభీరంగా వుంటున్నారు. మొహంలో అలసట కూడా చోటు చేసుకుంటోంది. దయచేసి ఇలా అడుగుతున్నందుకు ఏమీ అనుకోకండి.''

సుబ్బలక్ష్మిగారు అంత ఆత్మీయంగా మాట్లాడటంతో శైలజకు ఆవిడమీద ఉన్న గౌరవం రెట్టింపైంది.

''మీరు చెప్పినట్లుగా మాకు ఆర్థికపరమైన ఇబ్బందులు ఏమీలేవు. మనిషి అన్నాకా తిని కూర్చోకూడదని ఈ వ్యాపకం ఎంచుకున్నాను. కానీ నాగురించి మీరింత పరిశీలనగా గమనిస్తున్నారనుకోలేదు. నన్నూ మీదాన్నిగా భావించి నా ఆరోగ్యం గురించి మీరింత ఆపేక్షగా ఆలోచిస్తున్నందుకు కృతజ్ఞతలు. మరోసారి వివరంగా మీకు అన్ని విషయాలు చెబుతాను. మీ అందరికీ నాదొక ఆహ్వానం. వచ్చే ఆదివారం సాయంత్రం 5 గంటలకు శ్రీరాంనగర్‌లో జరిగే ఈ కార్యక్రమానికి మీరందరూ తప్పకుండా రావాలి'' అంటూ హేండ్ బ్యాగ్ లోనుండి ఆహ్వానపత్రాలు తీసి నలుగురికీ ఇచ్చి వస్తానని



చెప్పి వెళ్ళిపోయింది.


శైలజ వెళ్ళిపోయాకా నలుగురూ కవర్లలోని ఇన్విటేషన్లు బయటకు తీసి చదివారు. కొంతమంది వికలాంగ బాలబాలికలకు ఒక స్వచ్ఛంద సంస్థవారు కృత్రిమ అవయవాలు బహూకరిస్తారని, ఇద్దరు డాక్టర్లు, ఆ ప్రాంత మహిళా శాసనసభ్యురాలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని అందులో వుంది. శైలజ కోసం తప్పకుండా ఈ కార్యక్రమానికి వెళ్ళాలని నలుగురూ నిర్ణయించుకున్నారు.

• • •

ఆదివారంనాడు సుబ్బలక్ష్మిగారు, పద్మ, వనజ, వినుత నలుగురూ ఆటోమీద శ్రీరాంనగర్‌కు వెళ్ళారు. ఆరుబయట టిప్-టాప్ వేసివున్న ప్రాంతంలో జనం గుమిగూడి వుండటంతో అదే సభావేదికగా భావించి అక్కడికి వెళ్ళారు. దూరం నుండే వారిని చూసిన శైలజ పరుగు పరుగున వచ్చి వారిని రిసీవ్ చేసుకుని రెండవ వరుసలో కుర్చీలో కూర్చోబెట్టింది. మొదటివరసలో వికలాంగ పిల్లలు వారి తల్లిదండ్రులు కూర్చొని వున్నారు.

పది నిముషాలు గడిచేసరికి ఎం.ఎల్.ఏ. ఉమాదేవి, డాక్టర్లు, మహతి, మిహిర వచ్చారు. సభా నిర్వాహకులు, శైలజ వారిని రిసీవ్ చేసుకొని వేదిక వద్దకు తీసుకువచ్చారు. సంస్థ కార్యదర్శి రమాదేవి అతిథుల్ని, శైలజను వేదికపైకి ఆహ్వానించింది. వికలాంగ పిల్లల ఆరోగ్య సంరక్షణ గురించి డాక్టర్ మహతి, డాక్టర్ మిహిరలు వివరించారు. ఎం.ఎల్.ఏ. ఉమాదేవి వికలాంగులకు కృత్రిమ అవయవాలు (జైపూర్ లింబ్స్) అందజేసింది.

## తెలుసుకోండీ ఈ సంగతులు!



★ ప్రేమలో భక్తిని మిక్స్‌చేసి ఓ సినిమా తీస్తే ఎలా వుంటుందీ అన్న ఆలోచన ఫలితమే 'పిలిస్తే పలుకుతా' చిత్రం. కోడి దర్శకత్వం. (భక్తిరసం ఎక్కడుంటుందో, కోడి అక్కడే వుంటాడు).

★ 'మందారం' అనే పేరుతో మరో ప్రేమకథ చిత్రం వస్తోంది. చదువుకునే టైంలో ఈ ప్రేమ లేంటీ? అనేదే పాయింట్ అట! (ట్రెండ్‌కి ఎగెనెస్ట్‌గా వుందే).

★ ఉదయ్‌కిరణ్ లక్కీ కదా! విజయ్‌భాస్కర్ డైరెక్షన్‌లో ఓ చిత్రంలో నటిస్తున్నాడు. (అయితే సూపర్‌హిట్టే)

★ 'స్వేచ్ఛ' పేరుతో రానున్న ఓ చిత్రం అవార్డ్ గెల్చుకుంటుందిట గ్యారంటీగా. (చూద్దాం! అప్పుడే స్టేట్‌మెంట్స్ ఎందుకు?)

★ వేణు వుంటే ఆ సినిమా హిట్టేనట (అంత గ్యారంటీనా?)

★ ప్రేమ కథలతో విసుగొచ్చిన కొందరు ట్రెండ్ మార్చాలని భక్తి కథల జోలికి వెళ్తున్నారట. (వెరీగుడ్)

- ప్రియ

ఎంతో ప్రయాసతో వేదికపైకి వస్తున్న ఆ అంగవికలుర్ని చూసి వేదికముందున్న వారందరి హృదయాలు జాలితో నిండిపోయాయి. సుబ్బలక్ష్మిగారైతే ఏకంగా కళ్ళనీళ్ళు పెట్టుకుంది వారి అవస్థలు చూసి.

ముఖ్యఅతిథి ఎం.ఎల్.ఏ. ప్రసంగించింది.

''సభలో వున్న వారందరికీ నమస్కారాలు. గతంలో ఈ సంస్థవారి కార్యక్రమంలో పాల్గొన్నాను. సేవాసంస్థలు కూడా వ్యాపారంగా మారిపోయిన ఈ రోజుల్లో 'చేయూత' సంస్థవారు నిస్వార్థంగా సేవలందించడం అభినందనీయం. సంస్థ కార్యదర్శి రమాదేవి చెప్పిన ఒక విషయం నన్ను ఇక్కడికి మరలా తీసుకు వచ్చింది.

తన తీరిక సమయంలో ఇంటింటికీ తిరిగి చీరలు, ఇతర వస్తువులు అమ్మి ఆ లాభంతో అంగవికలురైన ఈ చిన్నారులకు ఒక మహిళ సహాయం చేస్తోందని చెప్పగానే నా హృదయం చలించిపోయింది. ఆమె ఎవరోకాదు శ్రీమతి శైలజ. ఆమెని హృదయపూర్వకంగా అభినందిస్తూ ఈ జ్ఞాపికను బహూకరిస్తున్నాను.''


ఎం.ఎల్.ఏ. ఉమాదేవి వెలుగులు విరజిమ్ముతున్న దీపం బొమ్మను శైలజకు అందజేసింది.

''నిరాశా నిస్పృహలకు లోనై అంధకారంలోవున్న జీవితాలలో వెలుగు నింపాలన్న సంకేతమే ఈ జ్ఞాపిక'' అంటూ శైలజను అభినందించగానే సభాస్థలి అంతా చప్పట్లతో ప్రతిధ్వనించింది.

అందరూ శైలజ మాట్లాడాలని అభ్యర్థించగా నమస్కారం చేస్తూ మైకు ముందుకు వచ్చింది శైలజ. ఆమె ఏం చెబుతుందా అని అందరూ ఆతృతగా చూస్తున్నారు.

''పెద్దలందరికీ నా నమస్కారాలు. పిన్నలందరికీ ఆశీస్సులు.

మేము ఈ ఊరు వచ్చి సంవత్సరమయ్యింది. ఈ ఊరు వచ్చిన కొత్తలో 'చేయూత' సంస్థ రమాదేవిగారితో నాకు పరిచయమైంది. వారి ఇంట్లోనే అంగ వికలురకు ఒక స్కూలు నడుపుతున్నానని చెప్పగానే నేను ఆశ్చర్యపోయాను. ఒక్క వ్యక్తి ఇంత పెద్ద కార్యక్రమం నిర్వహించడం చూసి నేనూ ఏదైనా వీరికి సాయం చేయాలనుకున్నాను. మావారితో చెబితే ఓ పదివేలు ఇమ్మంటే ఇస్తారు. కానీ నేనే సంపాదించి వారికి సాయం చేయాలని ఆలోచించి చీరల అమ్మకం ప్రారంభించాను. మావారికి తెలుసున్న బట్టల షాపు వాళ్ళని కలిసి వారికి నా ఆలోచన వివరంగా చెప్పి మిల్లుల నుండి వచ్చేరేటుకే చీరలు ఇమ్మని అడిగితే సంతోషంగా ఇచ్చారు.




ఇక నా చీరల అమ్మకంలో నాకు ప్రోత్సాహమిచ్చిన వ్యక్తి సుబ్బలక్ష్మిగారు. తను రెగ్యులర్‌గా కొనడమే గాక ఆవిడకు తెలిసున్న వారందరిచేతా చీరలు కొనిపించారు. తర్వాత ఒక హేండ్లూమ్ షాపుతను తక్కువ ధరకే నాకు వస్తువులు ఇవ్వడం నాకు మరింత ప్రోత్సాహాన్నిచ్చింది.

మావారు బ్యాంక్ ఆఫీసరవడం వలన ఉదయం తొమ్మిదిన్నరకు వెళ్ళి రాత్రి 7 గంటలకు ఇంటికి వస్తారు. మా బాబు గుంటూరులో ఎం.ఎస్.సి. చదువుతున్నాడు. అందువలన నాకున్న సమయాన్ని సద్వినియోగం చేయాలని ఈ రెండు వ్యాపారాలను ఎంచుకొని ఈ సంవత్సరంలో నేను సంపాదించిన మొత్తం 20 వేల రూపాయలను 'చేయూత' సంస్థ వారికందించాను.

భగవంతుడు మనకు అన్ని అవయవాలు ఇచ్చాడు. కానీ ఈ చిన్నారులపట్ల విధి చిన్నచూపు చూసింది. కనీసం నడవడానికి కూడా అశక్తులై ఇతరుల మీద ఆధారపడ్డున్నారు. మానవతతో వారికి సాయం చేయడం మనధర్మంగా భావించాలి. ఈ సమాజం నాకేమిచ్చింది అని వితండవాదన చేయకుండా ఈ సమాజానికి నేను ఎంతవరకు ఉపయోగపడగలను? అని ప్రశ్నించుకొని ఆత్మ విమర్శ చేసుకొని అందరూ ఆనందంగా వుండడానికి మనవంతు కృషి మనం చేయాలి.

ఏ ఉద్యమమైనా చిన్న అడుగుతో ప్రారంభమవుతుందన్న సత్యాన్ని గ్రహించి ఎవరికి వారే బాధితుల్ని ఆదుకోవడానికి పూనుకొని సమాజ వికాసానికి అంకితం కావాలి.''

శైలజ ఉపన్యాసం పూర్తవగానే సభాస్థలి మరొక్కసారి చప్పట్లతో మారుమ్రోగింది.

అతిథులందరూ వెళ్ళిపోయాక సుబ్బలక్ష్మిగారు శైలజ దగ్గర కొచ్చి ఆమెని గాఢంగా కౌగలించుకొని ఆనంద బాష్పాలు రాలుస్తూ, ''కేవలం కాలక్షేపం కోసం టి.వి.లు చూస్తూ ఇతరుల విషయాలు చర్చించుకుంటూ కాలాన్ని వృథా చేసుకునేవారికి నీవు కనువిప్పు కలిగించావు. ఒక నిర్దిష్ట లక్ష్యసాధనలో నిరంతరం శ్రమించాలని నువ్వు నిరూపించావు. మామధ్యనే ఇంతటి ఆదర్శవాది, కార్యవాది వుందని గ్రహించలేకపోయాం.

నీ స్ఫూర్తితో మేం కూడా సేవా కార్యక్రమాలకు మావంతు సహకారాన్నందిస్తామని వాగ్దానం చేస్తున్నాం'' అని ఉద్వేగంతో చెప్పింది. వనజ, వినుత, పద్మ కూడా శైలజను అభినందించారు. అందరూ ఒక మహత్తర విజయాన్ని సాధించిన ఆనందంతో కొత్త ఆలోచనలు నిండిన హృదయాలతో తమ కాలనీకి బయల్దేరారు.

★